# భావన

'డాడీ, నేను మళ్ళీ పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను. ఉదయం కాఫీ తాగుతూ పేపరు పట్టుకు బాల్కనీలో కూర్చున్న తండ్రి దగ్గరికి వచ్చి అంది భావన. ఆయన పేపరులోంచి తలెత్తకుండానే 'ఆహా, అలాగా!' అని నిర్లిప్తంగా అన్నారు. భావన మొహం ఎర్రబడింది. తండ్రి అంత పట్టించుకోకుండా తన విషయం కాదన్నట్టు మాట్లాడడంతో ఉక్రోషం వచ్చింది. 'పెళ్ళి చేసుకోవాలనుకున్నది మీ కూతురు. ఎవరిని చేసుకుంటుందో కూడా తెలుసుకోవాలనుకోవడంలేదా' రెట్టించింది. 'తెలుసుకుని ఏం చెయ్యాలి...? నువ్వన్నీ నిర్ణయించుకునే చెప్తున్నావనుకుంటున్నాను. ఇప్పుడు ఇంక నేనదేం ఉంది? నేనేమన్నా వద్దంటే మానేస్తావా? పేపరు కాస్త పక్కకు తప్పించి కూతురి మొహంలోకి చూస్తూ అన్నారు ప్రసాదరావు. భావన మొహం మరికాస్త ఎర్రబడింది. కోపంగా చూసి "అంటే, నేనెవరిని చేసుకున్నా ఆ విషయం మీకనవసరమా!' అంది. 'మరి అంతకంటే అనటానికి ఏం ఉంది? మా అభిప్రాయాలు, మా ఇష్టాయిష్టాలు, మా సలహా సంప్రదింపులు, మేం చెప్పడం నువ్వు వినడంలాంటివేమన్నా ఉన్నాయా?' ఆయన ప్రతి మాటా నొక్కి మాట్లాడుతూ కూతురి పట్ల ఉన్న అసంతృప్తిని వ్యక్తం చేశారు.

ఏదీ అనబోయి, కాస్త నిలదొక్కుకుని – "అంటే కశ్యప్‌కి డైవర్స్ ఇచ్చానని మీ కోపం... నాకిష్టం లేనివాడితో సర్దుకు బతుకుతూ బయటికి రాకుండా మీ ఆనందం కోసం ఆ కాపురం చేసుకుంటూ ఉంటే నేను చాలా మంచిదాన్నయ్యేదాన్ని. నాసుఖం, ఆనందం వెతుక్కుంటే అది మీకు నచ్చదు అవునా? అంత సర్దుకు బతకాల్సిన అవసరం నాకేం లేదు" పొగరుగా అంది. ప్రసాదరావు అదోలా నవ్వారు – "నీకు

మెడలు వంచి మేం ఆ పెళ్ళి చేసినట్టు గుర్తు లేదు నాకు. నీ కోలీగే అని ఏణ్ణర్థం స్నేహాలు, ప్రేమలు, షికార్లు చేసి అతన్ని ఎన్నుకుని, పెళ్లి చేసుకుంటానని నీవే మాకు చెప్పినట్టు గుర్తు."

ఆ మాటల్లో వ్యంగ్యం అర్థం చేసుకున్నాక, "నా భావాలకి, ఎక్స్‌పెక్టేషన్స్‌కి అతను సరితూగలేదు. పెళ్ళికి ముందున్న అతనికి పెళ్ళి తరువాత కశ్యప్‌కి అసలు పోలికే కనపడలేదు. ఏదో ఒక మొగుడు, కట్టుకున్నానని సర్దుకు బతకాల్సిన అవసరం నాకు లేదు. నా అంచనాలు తలకిందులయ్యాయి. చేసిన పొరపాటు సర్దుకుని ఇంకో ఛాన్స్ తీసుకోవాలనుకోవడంలో తప్పు కనిపించిందా మీకు?" అంటూ ఆయన్ని దులిపేసింది.

ఆవేశంగా ఉన్న కూతురి వంక చిరునవ్వుతో చూశాడు ప్రసాదరావు. "నేను ఇదివరకు చెప్పినట్టు గుర్తు - జీవితంలో ఆశించినవి, కోరుకున్నవి మనం అనుకున్నట్టు జరగాలని ఆశపడ్డవి మనకు ఎవరూ ఓపళ్ళెంలో పెట్టి అందించరు. అవి అందుకోవడానికి మన వంతు ప్రయత్నం మనం చేస్తే కొంతవరకు అందుతాయి. ఎదుటివాళ్ళే మనకు కావలసినవన్నీ అందించాలని అనుకోవడం అవివేకం. అలా ఆశించినవారు తెలివి తక్కువవారు - అలాంటివారిలో నీవు ఒకర్తివి. జీవితంలో - అన్నిటికంటే సంసారంలో అవతలి మనిషి నించి మనం ఏదో ఆశించే ముందు మనం ఏం చేశాం, ఏం అందించాం అవతలివారికి అని తరిచి చూసుకోవాలి. ఎప్పుడూ ఒకే వైపు నించే ఆశించడం అవివేకం అని నీకానాడే చెప్పాను. అదే ఇప్పుడూ చెప్తున్నాను. రెండోసారన్నా నే చెప్పింది ఆలోచిస్తే మంచిది" తండ్రి మాట్లాడుతున్నంత సేపూ మొహం గంటుపెట్టుకు కూర్చుంది.

'కార్తీక్ అలాంటివాడు కాదు' చాలా నమ్మకంగా అంది. "ఓ కార్తీక్ అంటే ఆ కుర్రాడా... ఇంటికి వస్తుంటాడు. నువ్వు అతనితో బయటికి వెళ్తుంటావు గదా" అన్నాడాయన. "ఆ.. అతనే" ఉత్సాహంగా అంది భావన. 'మా ఆఫీసులోనే జాయిన్ అయ్యాడు. చాలా సరదాగా, చలాకీగా, స్మార్ట్‌గా ఉంటాడు' అందామె. 'ఆహా... ఈ మాటలు కశ్యప్ అప్పుడు కూడా చెప్పినట్టున్నావు' నవ్వుతూ అన్నారాయన. భావన మొహం మాడ్చుకుంది. "చెప్పనక్కరలేదు. అప్పుడు పొరపడ్డాను. తొందరపడ్డాను. అర్థం చేసుకోలేకపోయాను" కటువుగా అంది.

"ఈసారి తొందరపడలేదనుకుంటాను. మళ్ళీ అదే మాట చెప్తున్నాను. ఆడయినా, మగయినా ప్రేమికులుగా ఉన్నట్టు భార్యాభర్తలయ్యాక ఉండరన్న సత్యం గ్రహించాలి.

ప్రేయసిగా చూపించే ప్రేమ, అభిమానం, ఆరాటం, ఉత్సాహం అన్నీ పెళ్ళయ్యాక బాధ్యతాయుత జీవితంలో మరుగుపడ్తాయన్నది అమ్మాయిలు, అబ్బాయిలు గుర్తించండి. ఇంతకంటే చెప్పేదేమీ లేదు." పేపరులో ముఖం దించుకున్నారాయన. ఆమె తండ్రి వంక కోపంగా చూసి విసవిసా వెళ్ళిపోయింది.

"ఏంటి, ఏం జరిగింది? అది చాలా రుసరుసలాడుతూ వెడుతోంది?" వంటింట్లోంచి వస్తూ సునంద అడిగింది. "నీకూతురు మళ్ళీ పెళ్ళి చేసుకుంటుందిట.." అన్నారాయన. "మీ పర్మిషన్ కావాలటాదానికి? మీరేం అన్నారు? ఇంతకీ, ఎవరా అదృష్టవంతుడు" నవ్వింది సునంద.

"అదృష్టవంతుడనాలా... దురదృష్టవంతుడనాలా..." ప్రసాదరావు నవ్వాడు. "కార్తీక్... " గుంభనంగా అన్నారు.

"అనుకున్నాను. దాని తిరుగుడు, దాని రాకపోకలు చూసి అనుమానం వచ్చింది. సరే, అదే చెప్తుంది కదా అని ఊరుకున్నాను. దీనికంటే చిన్నవాడు, ఆఫీసులో జూనియర్. దీనికెలా నచ్చాడో మరి."

"కశ్యప్‌లా కాదట. చాలా సరదాగా, లైవ్లీగా ఉంటాడట" కాస్త వ్యంగ్యంగా అన్నారు. "దీని మొహం. అసలు దానికేం కావాలో దానికే తెలుసా, మనుషులని అంచనా వేయడం తెలిస్తే కశ్యప్‌లాంటి మంచివాడిని దూరం చేసుకునేదా! ఈ కుర్రాడు చిన్నవాడు గదా - పార్టీలు, పబ్బులు, క్లబ్బులు అంటూ దీని వెనుక తిరుగుతున్నాడుగా, అందుకు చాలా సరదా అయిన వాడిలా కనిపిస్తున్నాడు. ముప్ఫై ఏళ్ళు వస్తున్నా దీనికింక మెచ్యూరిటీ రాలేదు. టీనేజ్ అమ్మాయిలా ప్రవర్తిస్తుంది" విరక్తిగా అంది సునంద. మరి మీరేం అన్నారు. "ఒప్పుకున్నారా? ఆ అబ్బాయి దీనికంటే బాగా చిన్నవాడిలా ఉన్నాడే.. ఆ కార్తీక్ తమ్ముడిలా ఉన్నాడు. పెళ్ళి, డైవర్సు... అప్పుడే మళ్ళీ రెండో పెళ్ళి. ఈసారన్నా కాస్త నిదానించి ఆలోచిస్తే బాగుండు" సునంద వ్యాకులపాటుతో అంది.

"నా 'ఎస్'లు 'నో'లు దానికేం లెక్క. ఏదో మన ఇంట్లో ఉంది కాబట్టి చెప్పాలని చెప్పింది. నీకేం చెప్పలేదా మరి" అడిగారాయన. "ఆ... ఇలాగే, చేసుకోవాలనుకుంటున్నాను అంది. నేను మాత్రం ఏమంటాను. అంటే వింటుందా, దానికి నచ్చిందే చేస్తుంది. మన పెంపకంలో ఏం లోపం ఉందో మరి. ఒక్కతే .. పిల్లని దాని ఇష్టాన్ని ఏదీ కాదనకపోవడం మనదే తప్పు అనిపిస్తోంది. ఇచ్చిన స్వేచ్ఛని, స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేస్తున్నారీ అమ్మాయిలు. సంపాదనుండే సరికి

ఇంకెవరినీ లెక్క చెయ్యక్కరలేదనుకుంటున్నారు. మనదే తప్పు..." విరక్తిగా అంది. "సునందా, పిల్లల్ని గిరి గీసి కూర్చోపెట్టే రోజులు పోయాయి. మనం ప్రేక్షక పాత్ర వహించడం కంటే చెయ్యగలిగిందేమీ లేదు. మంచీ చెడూ చెపుతాం. వినకపోతే వాళ్ళ ఖర్మ అనుకోవాలి" అన్నారాయన.

"అలా అని ఊరుకోలేం కదా. డైవర్స్ ఇచ్చి మన ఇంట్లో కూర్చుంటే నీ దారి నువ్వు చూసుకో అని వదిలేయగలిగామా? ఉద్యోగం ఉంది. నీ బతుకు నీది అనగలిగామా? తల్లిదండ్రులుగా పిల్లల కష్టసుఖాలు మనవి కావనుకునే మనోనిబ్బరం మనకెలా ఉంటుంది? కానీండి, మరోసారి చెప్పి చూస్తాం... వినకపోతే ఏం చేస్తాం?" అంటూ కప్పులు పట్టుకు లోపలికి వెళ్ళింది సునంద.

* * * * * *

"కార్తీక్, మన పెళ్ళికి మావాళ్లు అంతగా ఇష్టపడడంలేదు. ఏదీ తేల్చి చెప్పడంలేదు" అంది భావన. "మీవాళ్ళు సరే, మావాళ్ళు అసలు ఒప్పుకోవడంలేదు. నీకంటే పెద్దదాన్ని, డైవర్సీని చేసుకునే ఖర్మ నీకేంటి? మాకు ఇష్టంలేదు. కాదు కూడదు అని చేసుకోవాలంటే నీ ఇష్టం వచ్చినట్టు చేసుకో అంటున్నారు కోపంగా" అన్నాడతను.

'అయితే ఏం చేద్దాం... కార్తీక్? చేసుకున్న తరువాత వాళ్ళే సర్దుకుంటారు. మహా అయితే నాలుగు రోజులు మాట్లాడరు. తరువాత వాళ్ళే మెత్తపడతారు. రిజిష్టర్ ఆఫీసులో అప్లై చెద్దాం' అందామె. 'భావనా, ఉండు తొందరపడకు. మరోసారి పెద్దవాళ్లని ఒప్పించడానికి ప్రయత్నిద్దాం. ఈ పెళ్లితో అందరినీ దూరంచేసుకుంటే మనం ఏమాత్రం సంతోషంగా ఉండలేం... మరి కొన్నాళ్లు టైమియ్యి"అన్నాడతను.

"నీ ఇష్టం..." అప్రసన్నంగా అంది భావన.

* * * * * *

రెండురోజులు కాదు... ఆ తర్వాత వారం పది రోజులయినా కార్తీక్ పెళ్ళి మాటే ఎత్తలేదు. అతను పెళ్లి గురించి పట్టించుకుంటున్న సూచనలు ఎక్కడా కనిపించలేదు. భావన రెండు మూడుసార్లు అడిగితే "ఇంకా మాట్లాడలేదు, సందర్భం దొరకలేదు...' అంటూ దాటవేశాడు. మాటలతో తప్పించుకొన్నాడు. అంతేకాక, తనని అవాయిడ్ చేస్తున్నట్టు కూడా అనిపించింది. "పనుంది, ప్రాజెక్ట్ పనిమీద తిరుగుతున్నాను. ఇవాళ రాలేను" అంటూ రెండు మూడుసార్లు తప్పించుకున్నాడు. ఇక ఆగదలచుకోక పదిహేను రోజుల తర్వాత భావన అతన్నిగట్టిగా నిలేసింది ఆఫీసులో. "ఏమిటి కార్తీక్, నన్నెందుకు తప్పించుకు తిరుగుతున్నావు?" ఆవేశంగా

అరిచింది. "రెండు రోజుల్లో మా వాళ్లతో మాట్లాడి చెప్పానన్నావు. ఏం వాళ్ళు ఒప్పుకోలేదా?" అని అడిగింది.

కార్తీక్ తల అడ్డంగా తిప్పాడు. "అసలు ఒప్పుకోవడం లేదు..." అంటూ నసిగాడు. "ఎవరికీ ఇష్టంలేకుండా చేసుకుని మనం ఏం సుఖపడ్తాం...?" చూపులు తప్పించి అన్నాడు. "ఏం ఎవరూ ఇష్టపడకపోతే మనం ఆనందంగా ఉండలేమా? నీ మొహం చూస్తే నీకే ఇష్టం లేనట్టు కనిపిస్తోంది" సూటిగా నిలేసింది.

కార్తీక్ తలదించుకున్నాడు. 'తరువాత ఏదో నిర్ణయించుకున్నవాడిలా తలెత్తి, "అది కాదు భావనా, వాళ్ళన్నారని కాదు. నాకే... భావనా, నా మనసులో మాట సరిగ్గా వ్యక్తం చేయలేకపోతున్నాను. చూడు.. నీ ముందు ... నేనో స్టూడెంటు కుర్రాడిలా... నువ్వో బాస్‌లా... ఎంతసేపూ నువ్వు ఏమంటావో, నిన్నెలా ఇంప్రస్ చేయాలో అనుకుంటూ, ఇప్పుడు బాయ్ ఫ్రెండ్‌లా నిన్ను ఇంప్రస్ చేయగలిగినట్టు, పెళ్లయ్యాక చెయ్యగలనా... భావనా నీ స్వభావం నాకెందుకో భయం కలిగిస్తోంది. నీతో పరిచయం పెరిగిన కొద్దీ... నీ మాటే చెల్లాలనుకునే నీ మనస్తత్వం, నువ్వన్నదే రైటనే నీ అహం, నీ కనుసన్నల్లో మెలుగుతూ, నిన్ను సంతృప్తి పరచడానికి తాపత్రయ పడుతూ... బాయ్ ఫ్రెండ్‌గా సరదాగా స్పోర్టివ్‌గా తీసుకున్నట్టు రేపు నీ భర్తగా మారాక అస్తమానం నీ అహాన్ని చల్లారుస్తూ భరించగలనా అన్న అనుమానం నాలో తలెత్తుతోంది. భర్తగా నాలోనూ అహం తలెత్తితే మనిద్దరి మధ్య సామరస్యం ఉంటుందా? మాటల మధ్య కశ్యప్ గురించి నీ ఎక్స్‌పెక్టేషన్స్ నెరవేరలేదన్న అసంతృప్తి తెలిసిన నేను అంతకన్నా ఎక్కువగా నిన్ను సంతృప్తి పరుస్తూ, నా స్వభావానికి విరుద్ధంగా నీ ఆనందం కోసం నన్ను నేను ప్రతి క్షణం హెచ్చరించుకుంటూ, నా వ్యక్తిత్వాన్ని పణంగా పెట్టగలిగే ఔదార్యం నాకుందా అన్న అనుమానం వస్తోంది. నిన్నుచూసిన తరువాత అమ్మ నాతో ఒక మాట అంది. 'ఆ అమ్మాయిని చూస్తే ఎంత అందంగా ఉంది అనిపించింది కానీ, ఎంత మంచి అమ్మాయి, కార్తీక్ సుఖపడతాడు తప్పకుండా అనిపించలేదురా. ఆ అమ్మాయి మాటల్లో సౌమ్యత, నడతలో నమ్రత కనపడలేదురా. ఆ అందమైన మొహంలో, కళ్ళలో అభిమానం, అనురాగం కనపడలేదు. ఆ మొహంలో అహంకారం మాత్రమే కనిపించింది నాకు. పెద్ద చదువులు చదివింది. పెద్ద ఉద్యోగం. హోదా ఉంది. అందం ఉంది. కానీ ఓ భార్య, ఇల్లాలికి ఉండాల్సిన సహనం, ఓర్పు కనపడలేదు. చూస్తేనే అర్థం అయిందా అని అడుగుతావేమో – కొందరి మొహంలో కొన్ని భావాలు స్పష్టంగా కనపిస్తాయి' అంది అమ్మ. అమ్మ అన్న తరువాత ప్రతి అక్షరం తరిచి చూస్తే నా మనసులోంచి

భావాలు అమ్మ నోట్లోంచి వచ్చాయి అనిపించింది. ముఖ్యంగా వారం రోజుల నుంచి నీ మాటలు, నీ డిమాండ్లు...” అంటూ కార్తీక్ తలదించుకున్నాడు.

భావన మొహం నల్లబడింది. షాక్ తిన్నదానిలా అతన్ని కళ్లప్పగించి చూసింది. “సారీ భావనా, నా మనసుని నేనింకా నమ్మించుకోలేకపోతున్నాను. అందరినీ కాదని, వదులుకుని పెళ్ళి చేసుకోవాలన్నది జీర్ణించుకోలేకపోతున్నాను” అన్నాడతను. భావనలో ఒక్కసారిగా ఆవేశం పొంగింది. ఏదో ఘాటుగా అనాలని నోరు తెరిచి, మళ్ళీ విరమించుకుని విసురుగా లేచి అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

* * * * * *

పది రోజులుగా కార్తీక్ రాకపోవడం, కూతురు మొహం ముడుచుకు తిరగడం చూసిన తరువాత ఉండబట్టలేక “కార్తీక్ రావడంలేదేం? ఊర్లో లేడా?” అని సునంద అడిగింది డైనింగ్ టేబిల్ దగ్గర టిఫిను తింటున్న కూతురితో. జవాబివ్వలేదు భావన. “పెళ్ళి అన్నావు, ఎప్పుడు చేసుకుందామని?” మళ్ళీ అడిగింది. “చేసుకోవడంలేదు” ముభావంగా అంది. ప్రసాదరావు, సునంద మొహాలు చూసుకున్నారు. “అదేం...?” అంది సునంద ఆశ్చర్యపోతూ. “అదంతే...” అంది భావన. తనకు ఏమీ అర్థం కానట్టు మొహం పెట్టింది సునంద.

“ఏం జరిగింది, చేసుకోనన్నాడా?' కాస్త హేళనధ్వనించింది ఆ ప్రశ్నలో. భావన కొరకొరా చూసింది. “నేనే వద్దనుకున్నాను” తలెగరేసి పొగరుగా అంది. కూతురు ఎంత విసురుగా అన్నా, ఆగొంతులో పవరు తగ్గిందనిపించింది సునందకి. పరిస్థితేమిటో ఆ ఇద్దరికీ అర్థమైపోయింది. “అంతే, ఈ ప్రేమలు, దోమలు ఎంజాయ్ చేయడానికే. అన్నిప్రేమలూ పెళ్ళి దాకా రావు...” సునంద కూతురి వంక చూసి అంది. “డోన్ట్ బి స్టుపిడ్ మమ్మీ....” అంటూ భావన ఒక్కసారిగా మండిపడింది. కూతురు తనని ఎప్పుడూ అనని మాట అన్నందుకు ఆశ్చర్యపోయింది సునంద.

వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకోవడంలేదన్న వార్త బాధ కలిగించకపోగా, ఆ తల్లి దండ్రులకు గుండెల్లో ఏదో భారం దిగినట్లనిపించింది. తాము ఎన్నిసార్లు స్టుపిడ్ అయినా పరవాలేదు కానీ తమ కూతురు మాత్రం స్టుపిడ్ అవకూడదనే వాళ్లు కోరుకున్నారు.

***(సురభి, అక్టోబరు 2010)***